

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కమీషన్ల రాజ్యం నడుస్తోంది. సరుకుల సరఫరా, నిర్మాణ పనుల టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టేస్తూ ఎవరు కమీషన్ ముట్టజెబితే వారికే చెల్లిస్తున్నారు. బిల్లులను 45 రోజుల్లో చెల్లించాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా దుర్గగుడి అధికారులు బేఖాతరు చేస్తున్నారు.

కొండంత పెండింగ్..!



దుర్గగుడిలో కమీషన్ ఇస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు

- రూ.కోట్లలో పేరుకుపోతున్న బకాయిలు
- మంత్రి, దేవదాయ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు
- 45 రోజుల్లో చెల్లింపులు చేయాలని ఉత్తర్వులు
- వాటిని కాదని.. నెలల తరబడి పెండింగ్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు విషయమై దేవదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఆ శాఖ కమిషనర్ పది రోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బిల్లుల చెల్లింపు విషయంలో రాష్ట్రంలో అన్ని దేవాలయ కార్యనిర్వహణాధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పలు మార్గదర్శకాలు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లను కొత్తగా ఆదాయపు పన్ను చట్టంలోకి తీసుకురావడం కోసం మూడు కేటగిరీలుగా విభజించారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)గా నమోదైన లేదా రిజిస్టర్ అయిన వ్యాపార సంస్థల నుంచి కొనుగోలు చేస్తే. సదరు బిల్లులను 45 రోజుల్లో లేదా అగ్రిమెంట్ కాలంలోగా ఏది ముందయితే దాని ప్రకారం డబ్బు చెల్లించాలని సూచించారు. పెండింగ్ పెడితే కొనుగోలు చెల్లింపును ఖర్చుగా పరిగణించరని తెలిపారు. పైగా పెండింగ్ మొత్తాన్ని దేవాలయ ఆదాయానికి కలిపి దానికి కూడా పన్ను వేస్తారని స్పష్టం చేశారు. దీంతో పాటు దేవాలయాలకు వర్తించే ఆదాయపు పన్ను మినహాయింపును కూడా కోల్పోతామని పేర్కొన్నారు. కానీ, ఈ ఆదేశాలను ఎవ్వరూ అమలు చేయడం లేదు. ముఖ్యంగా దుర్గగుడిలో ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కారు.

దుర్గగుడిలో పరిస్థితి ఇదీ..

దుర్గగుడిలో సరుకుల సరఫరా, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు సంబంధిత విభాగాల అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల సుమారు రూ.10 కోట్ల పైచిలుకు బకాయిలు పేరుకుపోయాయి. ఇటీవల దేవస్థానంలో సరుకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ఆరు నెలల నుంచి సుమారు రూ.5 కోట్ల బకాయి పెట్టారు. గత ఏడాది బందరురోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రభుత్వం నిర్వహించిన యాగానికి వస్తువులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ఈ ఏడాది జనవరి వరకు కూడా బకాయిలు చెల్లించలేదు. ఈ విషయాన్ని పలువురు కాంట్రాక్టర్లు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి సంబంధిత విభాగ అధికారులను ప్రశ్నించి వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఓ విభాగంలో మహిళా అధికారిణి సుమారు రూ.5 కోట్ల వరకు బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. ఈ సమస్యను మాజీ ఈవో భ్రమరాంబ దృష్టికి ఆ కాంట్రాక్టర్ తీసుకెళ్లగా, ఆమె ఆ అధికారిణి తన ఛాంబరుకు పిలిపించుకుని బిల్లులు ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ మందలించారు. దీంతో అప్పటికప్పుడు ఆ అధికారిణి సుమారు రూ.కోటిన్నరకుపైగా బిల్లులను చెల్లించారు. మిగిలిన బిల్లులను యథాప్రకారం పెండింగ్‌లో పెట్టారు.

ప్రస్తుత ఈవో కేఎస్ రామారావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన నాలుగు రోజుల క్రితం ఆ మహిళా అధికారిణి బిల్లుల చెల్లింపులో జాప్యంపై వివరణ అడిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మహిళా అధికారిణి హడావుడిగా మరో రెండు కోట్ల రూపాయల బిల్లులను చెల్లించారు. కేవలం కాసుల కోసం కక్కుర్తిపడి బిల్లులను పెండింగ్‌లో పెడుతుండటంతో కొత్తగా టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ఇష్టపడట్లేదు. పాత కాంట్రాక్టర్లకు కొమ్ము కాసేందుకు కొన్ని విభాగాల అధికారులు బిల్లులు పెండింగ్ మంత్రాన్ని పఠిస్తుండటం గమనార్హం.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (శుక్ర)

సహార్ (ఉదయం) : 4-56 (శని)

సెంటు పట్టాలపై రాత్రి సంతకాలు

- వెయ్యి ఇంటి పట్టాల పంపిణీకి తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సంతకాలు
- ఇదేం పనంటూ నిలదీసిన టీడీపీ, జనసేన నేతలు
- కార్యాలయం వద్ద రోడ్డుపై పడుకుని అర్ధరాత్రి కొల్లు నిరసన

మచిలీపట్నం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ కార్యకర్తలకు దొంగ పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు రాత్రి 9.30 గంటల తరువాత కూడా కార్యాలయంలో సంతకాలు చేయడాన్ని టీడీపీ, జనసేన నేతలు అడ్డుకున్నారు. మాజీమంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ, జనసేన నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులను నిలదీశారు. రాత్రికిరాత్రి వెయ్యికిపైగా ఇంటి పట్టాలు తయారుచేసి ఆర్ఐ యాకూబ్, వీఆర్వోల ద్వారా దొడ్డిదారిన వైసీపీ నాయకులకు ఇచ్చేందుకు తీసుకువెళ్లడం ఎంతవరకు సమంజసమని తహసీల్దార్ సతీష్‌ను కొల్లు రవీంద్ర ప్రశ్నించారు.



అర్ధరాత్రి 12 గంటల సమయంలో రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న కొల్లు రవీంద్ర

(మిగతా 6లో)

వైసీపీకి అనుకూలంగా లేరని..

- కుటుంబం ఓట్లు తొలగించిన అధికార పార్టీ నేతలు
- ఓటు హక్కు కల్పించాలని జేసీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు
- నెల నుంచి తిరుగుతున్నా పట్టించుకోని సచివాలయ సిబ్బంది, వీఆర్వో

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అధికార పార్టీకి అనుకూలంగా లేరనే కారణంతో బందరు మండలం గోకవరం పంచాయతీలో ఒకే కుటుంబంలోని ముగ్గురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారు. స్థానికంగా ఉన్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికార పార్టీ నాయకులు కూడబలుక్కొని ఈ కుట్ర అమలు చేశారు. బందరు మండలం గోకవరం పంచాయతీలో ఈ ఘటన జరిగింది. తమ ఓటుహక్కును పునరుద్ధరించాలని ఓటర్లు జేసీ కార్యాలయ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు.

● నెల రోజుల నుంచి తిరుగుతున్నా

బందరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బందరు మండలం గోకవరం పంచాయతీ శివారు గ్రామమైన బడుగువానిపాలేనికి చెందిన బడుగు భాస్కరరావుకు (ఎస్‌జీఏ1690056)కు ఓటరు గుర్తింపు కార్డు ఉంది. ఆయన భార్య బడుగు కాంతమ్మ (ఎస్‌జీఏ1690049), కుమార్తె సాయి భవానీ (ఎస్‌జీఏ0817884)లకు ఓటరు గుర్తింపు కార్డులున్నాయి. కొంతకాలం క్రితం బతుకుదెరువు నిమిత్తం 12 కిలో మీటర్ల దూరంలోని మచిలీపట్నం పరాసుపేటకు వచ్చి అద్దెకు ఉంటున్నారు. తరచూ గోకవరంలోని ఇంటికి వెళ్లివస్తున్నారు. వీరు అధికార పార్టీకి అనుకూలంగా లేరనే కారణంతో కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఓటర్ల జాబితా నుంచి వీరి పేర్లను తొలగించారు. ఈ ముగ్గురు ఇక్కడ నివాసం ఉండటంలేదని పంచనామా రాసి ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించారు. వీరు గోకవరంలోని తమ ఇంటికి ఇటీవల వెళితే ఓటర్ల తమ ఇల్లు గోకవరంలోనే ఉందని, తాత్కాలికంగా మచిలీపట్నానికి వెళ్లామని, తమకు తెలియకుండానే ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లు తొలగించారని, ఓటుహక్కు కల్పించాలని గ్రామ సచివాలయంలో నెల రోజులుగా దరఖాస్తులు ఇచ్చినా తీసుకోలేదు. వీఆర్వో వద్దకు పదేపదే వెళ్లి చెప్పినా పట్టించుకోలేదు.



మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద భాస్కరరావు కుటుంబసభ్యులు

● జేసీ కార్యాలయంలో ఫిర్యాదు

బడుగు భాస్కరరావు తన భార్య, కుమార్తెతో కలిసి గురువారం జేసీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. తమ వద్ద ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను జేసీ కార్యాలయ అధికారులకు చూపారు. ఎంతోకాలంగా తాను, తన కుటుంబసభ్యులు గోకవరంలోనే ఓట్లు వేస్తున్నామని తెలిపారు. మళ్లీ ఓటర్లుగా చేర్చమని కోరుతూ జేసీ కార్యాలయ అధికారులకు అర్జీ అందజేశారు. దీంతో వీరిని జేసీ కార్యాలయ అధికాకారులు ఆర్డీవో కార్యాలయానికి పంపారు. ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీలక్ష్మి వీరి నుంచి వివరాలు తీసుకున్నారు. గోకవరం సచివాలయంలో ఓటు కల్పించాలని కోరుతూ అక్కడి సిబ్బందితో తాను మాట్లాడతానని ఆమె చెప్పారు. అధికార పార్టీ నాయకులు ఈ ముగ్గురికి ఓటు కల్పించేందుకు అవకాశం కల్పిస్తారో, లేక అడ్డంకులు సృష్టిస్తారో వేచి చూడాలి.

ఇండిపెండెంట్‌గానైనా బరిలో ఉంటా! తీవ్ర మనస్తాపానికి గురైన బోడె ప్రసాద్ - 6లో..

ఉత్తుత్తి పట్టాలు

- బాపులపాడులో పేదలకు ఇళ్ల పట్టాల పేరిట వైసీపీ మాయ
- రెవెన్యూ అధికారుల సహకారంతో ఎన్నికల డ్రామా
- స్థలాలు సేకరించకుండానే హడావిడి
- బదిలీ అయినా రిమోట్ తిప్పుతున్న తహసీల్దార్

రెవెన్యూ శాఖను పావుగా చేసుకుని అధికార వైసీపీ ఓట్ల డ్రామాకు తెర లేపింది. భూమి లేకుండానే ఇళ్ల పట్టాల పేరుతో బాపులపాడులో మళ్లీ రాజకీయం చేస్తోంది. ఇందుకోసం ఉత్తుత్తి ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రజలకు ఆవాసయోగ్యం కాని స్థలాలు, కోర్టు వివాదాల్లో ఉన్నవి, మరొకరి ఆధీనంలోనివి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గన్నవరం, బాపులపాడులో జాయింట్ తహసీల్దార్‌గా పనిచేసిన అధికారి ఒకరు అధికార పార్టీపై స్వామిభక్తి చాటుతున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరు జిల్లాకు వెళ్లినా.. బాపులపాడు మండల కార్యాలయంలోనే చక్రం తిప్పుతున్నారు. ఈ కార్యాలయంలోని వీఆర్వోలు, ఆర్ఐలతో తనకున్న సంబంధాల కారణంగా అన్ని పనులు చక్కబెడుతున్నారు. ఈ ఇళ్ల పట్టాల వ్యవహారాన్ని కూడా ఆయనే పర్యవేక్షిస్తున్నారు. కోడ్ కూస్తుందేమోనని హడావిడిగా బాపులపాడు మండలంలో అనేక చోట్ల పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్) : కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి గ్రామంలో మోడల్ ఇండస్ట్రియల్ పార్క్, మెగా ఫుడ్‌పార్కుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం 1,200 ఎకరాలు కేటాయించారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం, పంచాయతీ కామన్ అవసరాల కోసం ఇదే పారిశ్రామికవాడ సమీపంలో 100 ఎకరాలు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల్లో పేదలకు నివేశన స్థలాలు ఇవ్వకుండా మైనింగ్ దోపిడీకి పాల్పడింది. దాదాపు 80 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేపట్టారు. భారీ ఎత్తున తవ్వేసిన చోట ఇప్పుడు ఇళ్ల పట్టాల కథ అల్లారు. అక్రమ మైనింగ్ జరిపిన 80 ఎకరాలు పోనూ మిగిలిన 20 ఎకరాలు గుట్టలు, గోతులతో స్థలాలకు అనుకూలంగా లేదు. ఇప్పుడు ఈ భూమిలో పట్టాలిస్తామని హడావిడి చేస్తున్నారు. ఓట్ల గేలం కోసం పెద్దసంఖ్యలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2,500 మందికి ఇక్కడ నివేశన స్థలాలు ఇస్తున్నామన్న స్కెచ్ వేశారు. ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తహసీల్దార్ స్థానిక వీఆర్వోలు, ఆర్ఐలను రంగంలోకి దించి పనులు పురమాయించటం విశేషం. మల్లవల్లి పారిశ్రామికవాడలోని ఇదే స్థలాన్ని చూపించి సమీపంలోని ఓగిరాల పంచాయతీకి చెందిన 86 మందికి, రంగన్నగూడెం పంచాయతీకి చెందిన 147 మందికి పట్టాలు ఇవ్వడానికి సిద్ధం చేశారు. పది అడుగుల గోతుల భూముల్లో ఇళ్ల పట్టాల పేరుతో ఓట్ల డ్రామాను రక్తి కట్టిస్తున్నారు. వీటితో పాటు మండలంలోని బిళ్లనపల్లి, కొత్తపల్లిలో కూడా 239 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నారు. ఇక్కడ కూడా భూము లు అందుబాటులో లేవు. ఇతర రైతుల ఆధీనంలో ఉన్న బంజరు భూముల్లో ఇళ్ల పట్టాల డ్రామాను తెరపైకి తెచ్చారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవటం కుదరదు, న్యాయ వివాదాలు తలెత్తుతాయి. అయినా ఇళ్ల పట్టాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇక ఓగిరాల గ్రామంలో స్థలం లేకుండానే పట్టాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెం శివారు సింగన్న గూడేనికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోతుల చెరువును ఇళ్ల పట్టాల కోసం ప్రతిపాదించారు. నీటిపారుదల శాఖ పరిధిలోని ఈ చెరువు ఇళ్ల స్థలాలకు పనికిరాదని, తమకు ఆమోదయోగ్యం కాదని చెరువు ఆయకట్టు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు స్టే విధించింది. దీంతో పట్టాల పంపిణీకి బ్రేక్ పడింది.



మల్లవల్లిలోని పేదలకు పంచాలనుకుంటున్న భూమి ఇదే..



లమ్మ తోడుగా..


చల్‌రే.. చలో!

- ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు
- విద్యార్థులతో పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ కిటకిట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ముగియటం, కళాశాలలకు అవుటింగ్ ప్రకటించడం ఒకేసారి జరగటంతో.. పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ విద్యార్థులతో కిటకిటలాడింది. షెడ్యూల్ బస్సులన్నీ నిండిపోవటంతో పాటు ప్రత్యేక బస్సులు నడపాల్సి వచ్చింది. విజయవాడ నుంచి రాయలసీమకు అదనంగా పది ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడపాల్సి వచ్చింది. వీటితో పాటు రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం వైపుల కూడా ఆదనంగా ఐదు స్పెషల్ బస్సులను ప్రవేశపెట్టారు. గురువారం సాయంత్రం నాటికి 15 స్పెషల్ బస్సులు నడిపారు. తల్లిదండ్రులు వచ్చి విద్యార్థులను తీసుకు వెళుతున్నారు. శుక్రవారం సెకండ్ ఇయర్ ఇంటర్ పరీక్షలు కూడా ముగియనున్నాయి. దీంతో పెద్దఎత్తున విద్యార్థులు తమ సొంత ప్రాంతాలకు వెళతారు. శుక్రవారం బస్సులు నడపటానికి ఆర్టీసీ అధికారులు ప్లానింగ్ చేస్తున్నారు. రైళ్లు కూడా సాధారణం కంటే గురువారం రద్దీ పెరిగింది.



బ్యాగులతో నిండిన బస్టాండు



ఆనంద హేళ..



ఊరెళ్లిపోతూ..



ఎంపీ కనకమేడల దంపతులకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు

తిరుపతమ్మను దర్శించుకున్న ఎంపీ కనకమేడల దంపతులు

పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట, మార్చి 14 : రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ సతీసమేతంగా గురువారం పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్లను దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను, వేదాశీర్వచనం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శ్రీరాం సాయిప్రసాద్, రేపాల మోహనరావు, తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం తథ్యం

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని కనక మేడల రవీంద్రకుమార్ చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, తెనాలికి చెందిన గీతాంజలి మృతికి అధికార పార్టీయే కారణమన్నారు. ప్రతిపక్ష పార్టీలపై దుష్ప్రచారం చేసేందు కు గీతాంజలి ఆత్మహత్యను రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు అని, వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారని చెప్పారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నిరసన ప్రదర్శన

గౌతమ్‌సవాంగ్‌ను సస్పెండ్ చేయాలి

» తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ధర్నా

మచిలీపట్నం టౌన్, మార్చి 14 : నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న ఏపీపీఎస్సీ చైర్మన్‌గా పనిచేసిన గౌతమ్‌సవాంగ్, కార్యదర్శిగా పనిచేసిన ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులును సస్పెండ్ చేయాలని, వీరిపై కేసులు నమోదు చేసి సీబీఐతో విచారణ జరిపించాలంటూ మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుయువత, తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఎండీ సలీం, డొక్కు సాయికృష్ణ, చిన్నం సురేశ్, పిన్నెంటి అయ్యప్ప, కట్టాదుర్గా, మణికుమార్, రవితేజ, నాగసాయి, నికిలేశ్, వెంకటరమణ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. నిరుద్యోగులను మోసగించిన సీఎం జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మట్టికరిపించాలని వారు డిమాండ్ చేశారు.

ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించిన జగన్ : దేవినేని ఉమా

గొల్లపూడి : ఏపీపీఎస్సీని సీఎం జగన్ భ్రష్టు పట్టించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థల విధ్వంసానికి ఏపీపీఎస్సీ బలయ్యిందన్నారు. రాజకీయ లబ్ధికి, అక్రమాలకు వేదికగా చేసి జగన్ లక్షలమంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. తమ వారిని పోస్టింగుల్లో కూర్చోబెట్టుకునేందుకు గ్రూప్-1 పోస్టులను అమ్ముకుని అర్హులకు అన్యాయం చేశారన్నారు. అక్రమాల వెనుక ఉన్న సర్వీస్ కమిషన్ పెద్దల పాత్ర నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత పరీక్షల నిర్వహణ విఫలం కావడం ఇదే తొలిసారి అన్నారు. హైకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి : యార్లగడ్డ

గన్నవరం : ఏపీపీఎస్సీ పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడిన అధికారులను కఠినంగా శిక్షించాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్ష మూల్యాంకనంలో వైసీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. పరీక్ష పత్రాల మూల్యాంకనం మాన్యువల్‌గా చేయాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వం డిజిటల్ పద్ధతిలో నిర్వహించి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతి కారణంగా 162 మంది డీఎస్పీలు, డిప్యూటీ కలెక్టర్‌ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం రాజీనామా చేయాలి : తాతయ్య

జగ్గయ్యపేట : మెయిన్స్‌లో అక్రమాలపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీ పోస్టులను అమ్ముకున్న సీఎం జగన్‌రెడ్డి రాజీనామా చేయాలని జాతీయ తెలుగుదేశం కోశాధికారి, జగ్గయ్యపేట టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, గ్రూప్-1 మెయిన్స్‌లో ప్రభుత్వ అక్రమాలపై హైకోర్టు తీర్పు చెంపపెట్టని అన్నారు. ఇదేనా జాబ్ కేలెండర్, ఇదేనా నియమించే విధానమని తాతయ్య ప్రశ్నించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, ఇర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మరోసారి మోసగించేందుకే డ్రామాలు

» కొడాలి నానిపై వెనిగండ్ల ధ్వజం



గుడివాడ, మార్చి 14 : ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసే దళిత సోదరులను మరోమారు మోసం చేసేందుకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేసాడని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెనిగండ్ల మాట్లాడుతూ, గుడివాడను అన్నివిధాలుగా నాశనం చేసి, అభివృద్ధికి ఆమడదూరంలో నిలిపిన వ్యక్తిగా నాని చరిత్రలో నిలిచిపోయాడన్నారు. నియోజకవర్గ ప్రజలు నమ్మే స్థితిలో లేకపోవడంతో కొత్తగా విగ్రహ డ్రామాలు ప్రారంభించాడన్నారు. గుడివాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని తాను హామీ యిచ్చాక నానిలో చలనం కలిగిందన్నారు. ఎన్నికల కోడ్ రానున్న సమయంలో హుటాహుటిన విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశాడన్నారు. దళిత సోదరులు విగ్రహ ఏర్పాటుకు అనుమతుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరుగుతుంటే కోడ్ సమయంలో భూమిపూజ చేయడం దళిత సంఘాలను మోసం చేయడమేనన్నారు. ఇచ్చిన హామీ మేరకు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభిస్తానని వెనిగండ్ల స్పష్టం చేశారు.

అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై అవగాహన కలిగి ఉండాలి

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల ఖర్చుపై కనీస అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కృష్ణాజిల్లా పి.రాజాబాబు అన్నారు కలెక్టర్ కార్యాలయంలో గురువారం పలు రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఓటర్ల జాబితాలలో చేర్పులు తప్పు మార్పులు చేయడానికి అవకాశం ఉండదన్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు నిర్వహించే సమావేశాలు, ర్యాలీలు, వస్తు సామాగ్రి కొనుగోలుకు సంబంధించిన అన్నింటినీ లెక్కలోకి తీసుకుంటామన్నారు. పత్రికలు, టీవీ ఛానల్, సోషల్ మీడియా, ఫ్లెక్సీలకు, హోర్డింగ్‌లు, కరపత్రాలు తదితరాల ఖర్చులన్నీ లెక్కించబడతాయన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, పౌరసంబంధాల డీడీ వెంకటేశ్వరప్రసాద్, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ భర్త దుర్భాష.. మునిసిపల్ చైర్మన్ మనస్తాపం

జగ్గయ్యపేట, మార్చి 14 : జగ్గయ్యపేటలో ఊరచెరువు సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో బలహీనవర్గాలకు చెందిన మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రపై కౌన్సిలర్ భర్త దుర్భాషలాడటం వైసీపీలో కలకలం రేపింది. బుధవారం రాత్రి పట్టణంలో ఊరచెరువు సుందరీకరణ పనుల ప్రారంభోత్సవం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, అల్ట్రాటెక్ కంపెని ప్రతినిధులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేదని ఆ ప్రాంతానికి చెందిన మహిళా కౌన్సిలర్ భర్త ఉదయభాను సమక్షంలోనే చైర్మన్‌ను దుర్భాషలాడాడు. దాంతో పార్టీ వర్గాలు విస్మయానికి గురయ్యాయి. పార్టీ నేతలు, ఉదయభాను వారించకపోవటంతో చైర్మన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గురువారం అయన మునిసిపల్ కార్యాలయానికి రాలేదు. ఎవరు ఫోన్‌లను ఎత్తలేదు. ఊరచెరువు పనులు చేసిన కాంట్రాక్టర్ల మధ్య వ్యక్తిగత వివాదాలు, రియల్ ఎస్టేట్ వివాదాలు చైర్మన్ మీదకు మళ్లాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నకిలీ పట్టాల పంపిణీపై విచారణ జరిపించండి

» ఎన్నికల కమిషన్ సీఈవోకు రవీంద్ర ఫిర్యాదు

మచిలీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయించుకునేందుకు ఎమ్మెల్యే పేర్నినాని ఓటర్లకు ఇంటిపట్టాలు ఇచ్చి ప్రలోభపెడుతున్నారని, ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణచేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీమంత్రి కొల్లు రవీంద్ర ఎన్నికల కమిషన్ సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ఇటీవల కాలంలో నియోజకవర్గంలో రహదారుల పక్కన నివాసముంటున్న వారికి ఎమ్మెల్యే పేర్నినాని, ఆయన కుమారుడు పేర్నికిట్టు ఇంటిపట్టాలను పంపిణీ చేశారని తెలిపారు. ఆ పట్టాలపై అధికారుల ఫోర్జరీ సంతకాలు ఉంటున్నాయని ఆరోపించారు. పట్టాల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం లేదన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా చేయగా తహసీల్దార్ కార్యాలయముద్ర లేని పట్టాలు చెల్లవని డిప్యూటీ తహసీల్దార్ స్వయంగా చెప్పారని అన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారని కొల్లు తెలిపారు. రవీంద్ర వెంట టీడీపీ నాయకులు, ఐ దిలీప్‌కుమార్, పిప్పళ్ల కాంతారావు ఉన్నారు.



ఎన్నికల కమిషన్ సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు అర్జీ అందజేస్తున్న రవీంద్ర, టీడీపీ నాయకులు

ఫిర్యాదులు చేసినా ఆగని ఇళ్ల పట్టాల పంపిణీ..

నియోజకవర్గంలో వైసీపీకి ఓట్లు రాబట్టుకునేందుకు ఇంటిపట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశారు. దొంగ పట్టాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా.. మునిసిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి ద్వారా ఆయా డివిజన్‌లలోని సచివాలయాల్లో సిబ్బందితో గుట్టు చప్పుడుకాకుండా గురువారం కూడా పంపిణీ చేయించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఈబీసీ నేస్తం రూ.28.29 కోట్లు విడుదల

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 14 : ఎన్టీఆర్ జిల్లాలో 18861 అగ్రవర్ణ పేద మహిళలకు రూ.28.29 కోట్ల లబ్ధి చేకూరుస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ముఖ్యమంత్రి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సహాయాన్ని



వైఎస్సార్ ఈబీసీ నేస్తం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

బ్యాంకులకు నేరుగా జమచేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు ఆర్థిక సహాయపు చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం జగన్మోహనరెడ్డి అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడేళ్ల పాటు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మూడో విడతగా జిల్లాలో 18861 మంది మహిళలకు రూ.28.29 కోట్ల లబ్ధిని చేకూరిందన్నారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌లు, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో రూ.14.90 కోట్లు లబ్ధి

మచిలీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా కొంతమేర నిలదొక్కుకోవాలని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి జేసీ, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి,



ఈబీసీ నేస్తం చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జేసీ

ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు కాకుండా మిగిలిన అన్ని సామాజిక వర్గాలలో ఆర్థికంగా వెనకబడిన వారికి ఈబీసీ నేస్తం ద్వారా లబ్ధిచేకూర్చడం జరుగుతోందన్నారు. జిల్లాలో 9938మందికి రూ. 14.90 కోట్లను జమ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 21725మందికి రూ.32.58కోట్లను జమచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్‌జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ఢిల్లీరావును నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రానున్న ఎన్నికలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలో కలెక్టర్ ఢిల్లీరావు పర్యవేక్షిస్తారు. సహాయ రిటర్నింగ్ అధికారులుగా తిరువూరు నియోజకవర్గానికి ఆర్డీవో కె.మాధవి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, సెంట్రల్ నియోజకవర్గానికి మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, తూర్పు నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ భవానీ శంకర్, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి జేసీ పి.సంపత్‌కుమార్, నందిగామకు ఆర్డీవో రవీంద్ర, జగ్గయ్యపేటకు డీఎం సివిల్ సప్లయిస్ ఎం.వెంకటేశ్వర్లును నియమించారు.

రంగా విగ్రహ ఏర్పాటుపై వివాదం

» అడ్డుకున్న వైసీపీ కీలక నేత, కార్పొరేటర్

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ తొమ్మిదోవార్డు పరిధిలో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటు అంశం వైసీపీ నేతల మధ్య వివాదానికి దారితీసింది. శ్రీకృష్ణదేవరాయ సంఘం ఆధ్వర్యంలో ఆరిలోవలోని పెదగదిలి వద్ద వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటుచేయాలని భావించారు. అందుకోసం వైసీపీకి చెందిన తొమ్మిదో వార్డు కార్పొరేటర్ కోరుకొంట వెంకటరత్నస్వాతిని సంప్రదించగా ఆమె పెదగదిలి కూడలి వద్ద విగ్రహ ఏర్పాటుకు అనుకూలమని గుర్తించారు. దానికోసం ఏర్పాట్లు చేస్తుండగా వైసీపీ కీలక నేత, పొరుగు వార్డుకు చెందిన కార్పొరేటర్ స్థానికులను పంపి విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడకు సమీపంలోని సంజీవ్‌నగర్ వద్ద బీఆర్‌టీఎస్ గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటుచేయాలని ఈ మేరకు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే సదరు వైసీపీ నేత, కార్పొరేటర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్‌చేసి విగ్రహం ఏర్పాటుచేయడానికి అనుమతిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం రాత్రి అక్కడకు చేరుకుని విగ్రహం ఏర్పాటుచేయకుండా వార్డు సచివాలయం సిబ్బందిని కాపలాగా ఉంచారు. గురువారం ఉదయం విగ్రహాన్ని టౌన్‌ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనంలోకి క్రేన్ సహాయంతో ఎక్కించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువెళ్లిపోయారు. తర్వాత ఏమైందోగానీ విగ్రహాన్ని తీసుకువెళ్లి సంజీవ్‌నగర్‌లో గ్రీన్‌బెల్ట్‌లో దింపేశారు. విగ్రహం ఏర్పాటుచేయవద్దని తొమ్మిదో వార్డు కార్పొరేటర్‌కు చెప్పినట్టు సమాచారం. ఏదిఏమైనా వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటు అంశం తూర్పునియోజకవర్గంలోని వైసీపీ నేతల మధ్య వివాదానికి దారితీసినట్టయింది.



వంగవీటి రంగా విగ్రహాన్ని వ్యాన్‌లో తీసుకువెళుతున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

నాణ్యతలేని హెల్మెట్లపై నిషేధం

» జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం » హెల్మెట్లు విక్రయిస్తే చర్యలు » బ్లాక్ స్పాట్స్‌పై దృష్టి సారించాలి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బీఐఎస్ హాల్ మార్క్ లేని హెల్మెట్లపై జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. నగరంలో, జిల్లా వ్యాప్తంగా ఇకపై బీఐఎస్ హాల్ మార్క్ హెల్మెట్లనే వినియోగించేలా తప్పనిసరి చేయాలని భావిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన వర్చువల్‌గా ఎన్టీఆర్ జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాల్లో ప్రధానంగా హెల్మెట్లపై చర్చ జరిగింది. హెల్మెట్లు ఉన్నా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తుండటంపై చర్చ సాగింది. నాణ్యతలేని హెల్మెట్ల వినియోగం కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయని రవాణాశాఖ, పోలీసు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. ఇకపై నగరంలోనూ, జిల్లా వ్యాప్తంగా బీఐఎస్ హాల్‌మార్క్ కలిగిన హెల్మెట్లను విక్రయించాల్సిందేనన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా రవాణా, పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో 373 మరణాలు

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 2023 ఆర్థిక సంవత్సరంలో 373 మరణాలు చోటు చేసుకున్నట్టు జిల్లా ఉపరవాణా కమిషనర్ (డీటీసీ) ఎం పురేంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లావ్యాప్తంగా 2023 ఆర్థిక సంవత్సరంలో 1522 ప్రమాదాలు జరగ్గా, 373 మంది మరణించారని తెలిపారు.

బ్లాక్‌స్పాట్స్‌పై ఆందోళన

జిల్లావ్యాప్తంగా 2022లో111 బ్లాక్ స్పాట్స్ ఉన్నట్టు గుర్తించారు. దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది బ్లాక్ స్పాట్స్‌పై ఎలాంటి నివేదికను తయారు చేయలేదు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రమాదాలను అరికట్టాలంటే బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించగలిగితేనే సాధ్యమని చెప్పారు. గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్‌బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబుల్ స్టిక్కర్స్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు.

హిట్ అండ్ రన్ క్లెయిమ్‌ల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

ప్రమాదం చేసిన వాహనాల ఆచూకీ లభించని సందర్భాలలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి క్షతగాత్రులు, మృతుల కుటుంబసభ్యులకు పరిహారం అందించేందుకు వీలుగా ఎన్టీఆర్ జిల్లా హిట్ అండ్ రన్ క్లెయిమ్స్ పరిష్కార కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. కమిటీలో పోలీసు కమిషనర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, ఆర్టీవోలు, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ స్టాఫ్, డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రమాద నివేదిక, పోస్టుమార్టం నివేదిక, ఇతర పత్రాలను పరిశీలించిన మీదట సెటిల్మెంట్ చేస్తారు. ప్రమాదాలు జరిగిన సందర్భాలలో బాధితులకు పరిహారం చెల్లించే విషయంలో పాత సొలాషియం స్కీమ్ స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ స్కీమ్-2022 ద్వారా పరిహారం పెరిగింది. పరిహారం క్లెయిమ్ చేసుకోవటానికి వీలుగా దరఖాస్తు చేసుకునే ప్రక్రియను కూడా సులభతరం చేయటానికి వీలుగా ఒక కమిటీని వేశారు.

సెంటు పట్టాలపై రాత్రి సంతకాలు

(5వ పేజీ తరువాయి)

ఈ ఘటనపై జేసీ గీతాంజలి శర్మకు ఫోన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఇంత రాత్రి వేళలో ఇంటి పట్టాలపై సంతకాలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని అధికారులను టీడీపీ, జనసేన నాయకులు నిలదీశారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ఇప్పటికిప్పుడు ఇంటిపట్టాలు ఎలా తయారు చేస్తారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. తాము ఇంటిపట్టాలు సిద్ధం చేయడం లేదని, భూమికి సంబంధించిన పత్రాలను ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు సిద్ధం చేస్తున్నామని, తమ విధులకు ఆటంకం కలిగించే పనులు చేయవద్దని తహసీల్దార్ సతీష్ హెచ్చరించారు. కళ్లెదుటే ఇంటి పట్టాలు తయారు చేసినట్టుగా కనపడుతుంటే పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడమేమిటని టీడీపీ, జనసేన నాయకులు కొల్లు రవీంద్ర, ఐ.దిలీప్‌కుమార్, మాదివాడ రాము తదితరులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. దొంగపట్టాలతో పరారైన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.

రోడ్డుపై పడుకుని అర్ధరాత్రి కొల్లు నిరసన

దొంగ పట్టాల పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలతో కలిసి అధికారులు అక్రమాలకు పాల్పడటాన్ని నిరసిస్తూ కొల్లు రవీంద్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్ధరాత్రి రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. విషయం తెలిసి జేసీ గీతాంజలి శర్మ అక్కడికి వచ్చి చర్చలు జరుపుతున్నారు. త్రిసభ్య కమిటీ వేసి విచారణ జరిపిస్తానని జేసీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

ఇండిపెండెంట్‌గానైనా బరిలో ఉంటా!

» సీటు గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తా
» ఓడిపోయినప్పుడూ ఇంత ఆవేదన చెందలేదు
» తీవ్ర మనస్తాపానికి గురైన బోడె ప్రసాద్
» టికెట్ లేదని తెలిసి కార్యకర్తల ఆవేదన
» బోడెకు సీటు కేటాయించాలంటూ నినాదాలు..
» ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఇద్దరు కార్యకర్తలు

పెనమలూరు, మార్చి 14 : కృష్ణాజిల్లా పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఈసారికి టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఇవ్వలేకపోతున్నామని టీడీపీ అధిష్ఠానం స్పష్టం చేసింది. గురువారం పార్టీ పెద్దలు స్వయంగా ఫోన్ చేసి ఈ విషయాన్ని బోడెకు తెలియజేశారు. తనకు టికెట్ నిరాకరించడంతో బోడె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ విషయంపై విలేకరులతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు, లేనప్పుడు కూడా నిజాయితీగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠపరిచే క్రమంలో కుటుంబాన్ని కూడా సరిగా పట్టించుకోలేదని కన్నీటిపర్యంతమయ్యారు. చంద్రబాబు, లోకేశ్ ఆశీర్వాదాలతో ఈ ఎన్నికల్లో తప్పకుండా పోటీచేసి గెలిచి పెనమలూరు సీటును చంద్రబాబుకు కానుకగా ఇస్తానని తెలిపారు. చంద్రబాబు కుటుంబం నుంచి ఎవరొచ్చి పోటీ చేసినా తాను ముందుండి వారిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తానన్నారు. వారు కాకుండా ఇతరులకు సీటు ఇచ్చే పక్షంలో తాను కూడా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

పార్టీ సమావేశంలో ఉండగానే అధిష్ఠానం నుంచి ఫోన్

చిలకలూరిపేటలో 17వ తేదీన మూడు పార్టీల ఉమ్మడి సభను విజయవంతం చేసే విషయంపై గురువారం పోరంకిలోని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఉండగానే బోడెకు టీడీపీ అధిష్ఠానం నుంచి ఫోన్ వచ్చింది. పార్టీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. ఈసారికి అవకాశం ఇవ్వలేకపోతున్నట్టు తెలియజేయమన్నారని చెప్పడంతో బోడె ఒక్కసారిగా డీలాపడ్డారు. విషయం తెలిసిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, మహిళా నేతలు భారీ సంఖ్యలో కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. బోడెకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు కార్యకర్తలు ఒంటిపై పెట్రోలు పోసుకొని అంటించుకునే ప్రయత్నం చేయడంతో కార్యకర్తలు అప్రమత్తమై వారిని నిలువరించారు.

ఓడినా.. గెలిచినా ప్రజాసేవలోనే ఉన్నా..

అనంతరం బోడె మీడియాతో మాట్లాడుతూ.. తాను గెలిచినా.. ఓడినా గత పదేళ్లుగా ప్రజల్లోనే ఉన్నానన్నారు. సంవత్సరానికి రూ.కోటికిపైగా సొంత ఖర్చుతో పార్టీని బలోపేతం చేశానన్నారు. నియోజకవర్గంలో సర్వేలు తనకు అనుకూలంగా ఉన్నాయని, ఐవీఆర్ఎస్ సర్వేలో 86 శాతం ప్రజలు తనకు మద్దతు తెలిపారన్నారు. పార్టీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, కుర్రా నరేంద్ర, దేవినేని రాజా, శొంఠి శివరాంప్రసాద్, సంగెపు రంగారావులు మాట్లాడుతూ.. బోడెకు పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బూత్‌లెవెల్, గ్రామస్థాయి, క్లస్టరు స్థాయి, యూనిట్ స్థాయి, రాష్ట్రస్థాయి నాయకులు రాజీనామాలు సమర్పించారు.

ఎన్టీటీపీఎస్ సీఈగా నాగరాజు



ఇబ్రహీంపట్నం, మార్చి 14 : ఎన్టీటీపీఎస్ నూతన సీఈగా నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కడప రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ సీఈగా పనిచేస్తూ అయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఈగా పనిచేస్తున్న నవీన్ గౌతమ్ విద్యుత్ సౌధాకు బదిలీ అయ్యారు.

విమానరంగానికి డిమాండ్

విజయవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం విమానయానరంగానికి మంచి డిమాండ్ ఉందని విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. బెంజ్‌సర్కిల్‌లో జాన్ బెన్‌హర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏరో ఫాల్కన్స్ ఏవియేషన్ ట్రైనింగ్ అకాడమీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. దీన్ని లక్ష్మీకాంతరెడ్డి ప్రారంభించారు. దేశంలో ప్యాసింజర్ ట్రావెలింగ్ వేగవంతమైందన్నారు. పైలట్ ఉద్యోగాల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్న యువత పెరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెపై లైంగికదాడి ఘటనలో కీచక తండ్రి అరెస్టు


హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 14 : వీరవల్లి గ్రామంలో కన్నకూతురిపైనే అఘాయిత్యానికి ఒడిగట్టిన తండ్రిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సభ్య సమాజం తలదించుకునేలా చదువుకుంటున్న కుమార్తెపై పలుమార్లు లైంగిక అఘాయిత్యానికి పాల్పడి పరారీలో ఉన్న తండ్రిని డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో సీఐ నరసింహమూర్తి, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, ఎస్సై చిరంజీవి ముమ్మర గాలింపు తర్వాత సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నూజివీడు కోర్టుకు తరలించారు.

లారీ ఢీకొని టీచర్ మృతి



గన్నవరం, మార్చి 14 : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందింది. గన్నవరం బాలికల జడ్పీహైస్కూల్‌లో ఎస్ఏ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.వరలక్ష్మి పోరంకిలో కుటుంబంతో ఉంటోంది. రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం పాఠశాల అనంతరం ద్విచక్ర వాహనం(స్కూటీ)పై ఇంటికి వస్తుండగా ఎయిర్‌పోర్టు మెయిన్ గేటు వద్ద ఫ్లైఓవర్ అండర్ పాస్ దగ్గర హర్యానాకు చెందిన కంటైనర్ లారీ ఆమె వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నుజునుజ్జయింది. వరలక్ష్మి కుడికాలుపై లారీ టైర్లు ఎక్కడంతో బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అంబులెన్స్‌లో కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బూరగడ్డ వేదవ్యాస్‌కు అస్వస్థత



మచిలీపట్నం టౌన్, మార్చి 14 : మాజీ డిప్యూటీ స్పీకర్, పెడన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అస్వస్థతకు గురయ్యారు. మచిలీపట్నంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధిక రక్తపోటు, ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరడం వల్ల అస్వస్థతకు గురయ్యారు. ఆయనను వివిధ రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18



యనమలకుదురులో భద్రతా దళాల కవాతు

స్వేచ్ఛగా ఓటేయండి

పెనమలూరు, మార్చి 14 : సంఘ విద్రోహశక్తులు, అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామని, ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటర్లకు పూర్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు పేర్కొన్నారు. గురువారం కేంద్ర బలగాలతో కలిసి ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు యనమలకుదురులో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామని సీఐ తెలిపారు.



కానూరులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెలగపూడి శంకరబాబు



ఉయ్యూరులో ప్రచారం చేస్తున్న దేవినేని గౌతమ్, స్మిత



జంక్షన్ హనుమాన్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే అన్ని వర్గాల సంక్షేమం

ఉయ్యూరు, మార్చి 14 : చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్, మహిళలకు సంక్షేమ పథకాలతో సమాజంలో అన్నివర్గాలకు మేలు కలుగుతుందని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉయ్యూరు 10వ వార్డులో వారు పర్యటించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లువేసి రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. జగరోతు లక్ష్మణ్, సాంబశివరావు, సలీం, నరేంద్ర, కోటయ్య పాల్గొన్నారు.

పెనమలూరు : రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. గురువారం కానూరులో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొనానరు. నవ్యాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు బాటలు వేశారని, కానీ జగన్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి మొత్తాన్ని కుప్పకూల్చి ముప్పై ఏళ్లు రాష్ట్రాన్ని వెనక్కి నెట్టాడని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మేనిఫెస్టో కరపత్రాలను, టేబుల్ క్యాలెండర్లను స్థానిక నాయకులతో కలిసి వెలగపూడి పంచిపెట్టారు. హనుమాన్‌జంక్షన్ : రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎన్నికల్లో చరమ గీతం పాడి టీడీపీ-బీజేపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. గురువారం రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బాపులపాడు హనుమాన్‌నగర్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆయన ప్రచారం నిర్వహించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమిని బలపర్చాలని ప్రజలను కోరారు. టీడీపీ-జనసేన గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని అభ్యర్థించారు. వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమావరప్రసాద్, వడ్డిల్లి లక్ష్మి, జంక్షన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, యార్లగడ్డ సత్యనారాయణ, లంక సాంబశివరావు, చెరుకూరి హరికృష్ణ, కొల్లి బుజ్జి, కడవకొల్లు రాజేష్, వీరమాచనేని బుజ్జి, తాడిశెట్టి శ్రీను, కొండ నాగరాజు, షాహిదా, కర్రా ప్రసాద్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట సభను విజయవంతం చేయండి

పెనమలూరు : టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఈనెల 17న చిలకలూరిపేటలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు ఆళ్ల గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాలు, మునిసిపాలిటీల టీడీపీ నాయకులతో పార్టీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన సమావేశమయ్యారు. బహిరంగసభకు ప్రధాని మోదీ వచ్చే అవకాశం ఉన్నందున సభను భారీగా జరపనున్నామన్నారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెనిగళ్ల కుటుంబరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు పాల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్ : ఎన్నికల నేపథ్యంలో ఈనెల17న చిలకలూరిపేటలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి ఆధ్వర్యంలో మొదటిసారిగా నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయడానికి నాయకులు కృషి చేయాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. చిలకలూరిపేట బహిరంగ సభకు జనసమీకరణపై గురువారం టీడీపీ మండల కార్యాలయంలో పార్టీ గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. బహిరంగ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లడానికి నాయకులంతా కృషిచేయాలని కోరారు. మొదటి సారిగా మూడు పార్టీలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి కార్యకర్త జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీపీఎస్సీ అక్రమాలపై టీడీపీ ధర్నా



హనుమాన్‌జంక్షన్, మార్చి 14 : ఏపీపీఎస్సీ పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. పరీక్షల మూల్యాంకనంపై అక్రమాలను నిరసిస్తూ గురువారం విజయవాడరోడ్డులో పార్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మూల్యాంకనంలో అవకతవకలను నిర్ధారిస్తూ మెయిన్స్ రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇవ్వడం అభినందనీయమన్నారు. వేమపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, వీరమాచనేని బుజ్జి, ఆట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, విద్యార్థులు కొల్లు శిరీష, దయాల సుహాస్, దయాల రాజీవ్‌కాంత్, డొప్పల ప్రణీత్ పాల్గొన్నారు.



తేలప్రోలులో రైతులను సన్మానిస్తున్న చలసాని, పాలకవర్గం

రూ.50కే మేలుజాతి పశువీర్యం

● కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

ఉంగుటూరు, మార్చి 14 : మేలుజాతి పశువుల అభివృద్ధి ద్వారా పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని, అందుకోసం కృష్ణా మిల్క్ యూనియన్ మేలుజాతి పశువీర్యాన్ని (సెమన్) సబ్సిడీపై రూ.50 కే అందిస్తోందని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడిరైతు సంక్షేమం మన మతం-అలుపెరుగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా గురువారం తేలప్రోలు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు. విజయ డెయిరీకి పాలుపోసే పాడిరైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. పలువురు రైతులను చైర్మన్ సన్మానించారు. సమితి జిల్లా పాలకవర్గ సభ్యులు పల్లగాని కొండలరావు, పాలడుగు వెంకటరామ వరప్రసాద్(నాని), ట్రస్ట్ సభ్యులు పునుకొల్లు రత్నప్రసాద్, హరి రామకోటిరెడ్డి, పెదఅవుటపల్లి, తేలప్రోలు సంఘాల అధ్యక్షులు వేగే సాంబశివరావు, ఎ.వెంకటరెడ్డి, గన్నవరం క్లస్టర్ మేనేజర్ కోట ప్రసాద్, రూట్ ఏఎంపీవో షేక్ యాసిన్, సంమవేతన కార్యదర్శి వి.సాంబిరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ

పెనమలూరు, మార్చి 14 : తాడిగడప వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైభవంగా తిరుప్పావడ సేవను నిర్వహించారు. అధిక మొత్తంలో భక్తులు హాజరై స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. తిరుప్పావడ సేవకు అవసరమైన బల్ల కొనుగోలుకు భక్తులు బందారు రవిశంకర్, దామచర్ల అశోకబాబు రూ.36 వేలను వితరణగా స్వామికి సమర్పించారు.

పీవీపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీషకు డాక్టరేట్



శిరీషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివాజీబాబు

పెనమలూరు, మార్చి 14 : విట్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిచందన పర్యవేక్షణలో సెన్సిటివ్ ఎంటిటీస్ అనే అంశంపై చేసిన పరిశోధనకు కానూరు వీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సీఈసీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్దగిరి శిరీషకు విట్ అమరావతి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కళాశాల ప్రిన్సిపాల్ శివాజీబాబు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వాలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా ఉయ్యూరు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు

ఉయ్యూరు, మార్చి 14 : పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న తీరుకు వ్యతిరేకంగా గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉయ్యూరు సెంటర్‌లో నిరసన తెలిపారు. దేశంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్‌చేశారు. రైతులకు రుణ మాఫీచేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టంచేసి కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. ఆహార భద్రత చట్టాన్ని బలోపేతం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్రం డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి వీరమాచినేని జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం నాయకులు అన్నే సుబ్బారావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి.రాజేశ్, సీనియర్ నాయకుడు రత్నం భాస్కరరావు, తెలుగురైతు సంఘం నాయకులు కోగంటి కోటయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతులకు మద్దతుగా ర్యాలీ

హనుమాన్‌జంక్షన్: ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరల కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని ఏపీ రైతు సంఘం బాపులపాడు మండల అధ్యక్షుడు తోట సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. పంటలకు మద్దతు ధర కల్పించాలని కేంద్ర రైతు సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులు నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతుగా గురువారం జంక్షన్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. కొలుసు రంగారావు, పచ్చిగళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఎన్నారైల వితరణ అందిస్తున్న ప్రతినిధులు

గోపాలకృష్ణస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం

పెనమలూరు, మార్చి 14 : గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గోపాలకృష్ణస్వామి ఆలయానికి గ్రామ ఎన్నారైలు రూ.లక్ష వితరణగా అందించారు. గ్రామ ఎన్నారై అసోసియేషన్(అమెరికా) ప్రతినిధులు గురువారం ఆలయ కమిటీకి చెక్కు అందించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తామని గ్రామస్థులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కమిటీ సభ్యులు కిలారు ప్రవీణ్‌కుమార్, మోర్ల నరేంద్రబాబు, పాలడుగు సుధీర్, ఆలయ కమిటీ సభ్యులు గోగం వెంకటేశ్వరరావు, గద్దె శ్రీనివాస్, గ్రామస్థులు చనుమోలు శరత్‌బాబు, రాము, రామకృష్ణ పాల్గొన్నారు.

పార్సన్స్‌పేటలో కోదండ రామాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు 22 నుంచి

ఉంగుటూరు, మార్చి 14 : తేలప్రోలు పార్సన్స్‌పేటలోని కోదండ రామాలయం పునరుద్ధరణలో భాగంగా నూతన ఆలయ, విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 22నుంచి 27వరకు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆగమ విశారద చలమచర్ల మురళీకృష్ణమాచార్యుల నేతృత్వంలో ఈనెల 27న ఉదయం 8.13 గంటలకు మదష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్‌స్వామితో ప్రతిష్ఠ చేయిస్తామన్నారు. ఈనెల 22 నుంచి 26వరకు ఆలయ ప్రాంగణంలో ఉదయం క్రతువులు, అభిషేకాలు, విశేషపూజలు, సంగీత విభావరి, అఖండ రామనామ సంకీర్తన, ఆధ్యాత్మిక, పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. 27వతేదీ ఉదయం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గోవృషభ కల్యాణం, భారీ అన్నదాన కార్యక్రమం, సీతారామ కల్యాణం, పుష్పయాగం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న సాంబశివరావు, మౌనికాదేవి దంపతులు

ఘనంగా కోటయ్యస్వామి ఉరుసు

గన్నవరం, మార్చి 14 : కొత్తపేటలోని కోటయ్యస్వామి ఆలయంలో గురువారం 13వ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో కోటయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గన్నవరంతో పాటు పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. స్వామి సన్నిధిలో లడ్డూ ప్రసాదాన్ని వీసం సాంబశివరావు, మౌనికాదేవి దంపతులు వేలంలో దక్కించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2500 మందికి అన్న సంతర్పణ జరిపారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణబలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు మొవ్వ నాగబాబు, గౌరవ అధ్య క్షుడు వీసం ప్రసాదరావు, నిడమర్తి నాగేశ్వరరావు, వీసం నాగబాబు, అత్తులూరు కొండలరావు, మల్లికార్జునరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 432 మంది విద్యార్థులు

ఉంగుటూరు, మార్చి 14 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలవ్యాప్తంగా 432 మంది విద్యార్థులు హాజరవుతారని ఎంఈవో-1, 2లు కె.రవికుమార్, జె.సాంబశివరావు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని తొమ్మిది జడ్పీ హైస్కూళ్ల నుంచి 244 మంది ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు, 188మంది తెలుగుమీడియం విద్యార్థులు 432 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. తేలప్రోలు, ఇందుపల్లి, ఉంగుటూరు, మానికొండ, ఆత్కూరు ప్రభుత్వ జడ్పీ హైస్కూళ్లతోపాటు, పెదఅవుటపల్లి సెయింట్‌జార్జి ఆర్సీఎం హైస్కూల్, ఆత్కూరు గుడ్‌షెపర్డ్(జీఎంపీ) రీచ్ హైస్కూల్‌తో కలిపి మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవోలు తెలిపారు.



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పచ్చిపాల లక్ష్మణరావు

బడుగుల అభ్యున్నతే జనసేన లక్ష్యం

గన్నవరం, మార్చి 14 : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జనసేన పార్టీ ఆవిర్భవించిందని మండల అధ్యక్షుడు పచ్చిపాల లక్ష్మణరావు అన్నారు. దావాజీగూడెం స్పందన మానసిక వికాస కేంద్రంలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, కార్యదర్శి రజిత, కోలవెన్ను నాని, దుంపల సంధ్యారాణి, దిలీప్‌కుమార్, శేశయ్య రాము, వెంకటేశ్వరరావు, సిరాజ్, కిషోర్, దుర్గారావు, రాకేష్ నాయుడు, నాగమణి, రమాదేవి, సురేష్, నటరాజ్ పాల్గొన్నారు.


డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

కంకిపాడు, మార్చి 14: అంకమ్మగుడి వీధిలో రూ.13 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎల్.నారాయణరావు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల్లో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, పంచాయతీ సిబ్బంది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో వీకేఆర్ ప్రొఫెసర్ జీవన్‌కుమార్ ప్రతిభ

గుడివాడ : మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 11వ ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో గుడివాడ వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కొడాలి జీవన్‌కుమార్ మాస్టర్ వెయిట్ బ్యాక్ స్క్వాట్‌లో 100 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 70 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 140 కేజీలు మొత్తంగా 310 కేజీల బరువునెత్తి బంగారు పతకాలను సాధించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో వీకేఆర్ ప్రొఫెసర్ జీవన్‌కుమార్ ప్రతిభ



గుడివాడ : మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 11వ ఉమ్మడి కృష్ణాజిల్లా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో గుడివాడ వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కొడాలి జీవన్‌కుమార్ మాస్టర్ వెయిట్ బ్యాక్ స్క్వాట్‌లో 100 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 70 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 140 కేజీలు మొత్తంగా 310 కేజీల బరువునెత్తి బంగారు పతకాలను సాధించారు. కళాశాల ఆవరణలో బంగారు పతకం సాధించిన జీవన్‌కుమార్‌ను, కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావును కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ టీకల్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ఎస్.హెచ్.విప్రసాదరావు, అధ్యాపకులు, అభినందించారు.



కొట్టె వెంకట్రావు బృందాన్ని సత్కరిస్తున్న రామకృష్ణ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గెలుపే లక్ష్యం

● ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం ● కొట్టె వెంకట్రావుకు బండి రామకృష్ణ సత్కారం

మచిలీపట్నం టౌన్, మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కొట్టె కుటుంబ సభ్యులు 25 కార్లతో 30 రోజుల పాటు వివిధ నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం చేయడం ముదావహమని మచిలీపట్నం జనసేన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం చిలకలపూడిలో జనసేన జెండాను బండి రామకృష్ణ ఎగురవేశారు. కొట్టె వెంకట్రావు కుటుంబ సభ్యులను సత్కరించారు. కొట్టె వెంకట్రావు కుటుంబం 25 కార్లతో చేస్తున్న ఎన్నికల ప్రచారం ఎంతో వ్యయప్రయాసలకు కూడుకుందని, అయినప్పటికీ రాష్ట్ర మంతటా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం స్ఫూర్తి నిచ్చిందన్నారు. మాజీ కౌన్సిలర్, ఎన్నికల ప్రచార రథసారధి కొట్టె వెంకట్రావు మాట్లాడుతూ, కోడ్ వచ్చిన అనంతరం 25 కార్లను ఒక్కొక్క నియోజకవర్గానికి పంపుతామన్నారు. ఒకేసారి 25 కార్లలో పర్యటిస్తున్న సమయంలో వివిధ నియోజకవర్గాలలో జనసేన, టీడీపీ నాయకులు అడుగడుగునా స్వాగతం పలికారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌రెడ్డి అరాచక అక్రమ ప్రభుత్వాన్ని దించేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

అవనిగడ్డ రూరల్ : జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పులిగడ్డలోని మండలి దయాకర్ నివాసం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. వార్డు సభ్యురాలు మునిపల్లి శ్రీలక్ష్మి జెండాను ఆవిష్కరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు సహకారంతో 500 మందికి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, విక్కుర్తి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, కటికల వసంత్, బచ్చు వెంకట్ నాథ్, లంకె యుగంధర్, పూషడపు రత్నగోపాల్, బండ్రెడ్డి హరి, బోనం పాపారావు తదితరులు పాల్గొన్నారు. అవనిగడ్డలోని కోర్టు ప్రాంగణం వద్ద జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణు గోపాలరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

కోడూరు : కోడూరు ప్రధాన సెంటర్‌లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో, కోడూరు వంతెన సెంటర్ వద్ద జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌లు కట్ చేసి బాణాసంచాను కాల్చి మిఠాయిలు పంచారు. ఉమ్మడి పొత్తుతో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు గుంగయ్య, ఉల్లి శేషగిరిరావు, కాగిత రామారావు, పాలడుగు ఆనందరావు, గోగినేని సోమశేఖర్‌రావు, పిల్లి మల్లికార్జునరావు, వేములపల్లి రాజేష్, దామెర్ల నారాయణ, బడే వీరబాబు, బడే గాంధీ, కొండవీటి సునీత, కోట దామోదర్, పెద్ది బాస్కరరావు, బీజేపీ నాయకులు బండే అంజనేయులు, కోట సత్యనారాయణ నేతలు పాల్గొన్నారు.



ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మౌలాలిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవీంద్ర



27వ వార్డులో మాట్లాడుతున్న వెనిగండ్ల



మొవ్వపాలెం పల్లెబాటలో వర్ల కుమార్ రాజా

అన్ని వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తాం

● కొల్లు, వెనిగళ్ల

మచిలీపట్నం టౌన్, మార్చి 14 : అన్ని వర్గాలకు, ప్రత్యేకించి ముస్లిం మైనార్టీలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలోనే మేలు జరుగుతుందని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. జవ్వారుపేటలో ముస్లిం పెద్దలు షేక్ మౌలాలి తదితరులు గురువారం రాత్రి కొనకళ్ల, రవీంద్ర సమక్షంలో టీడీపీలో చేరారు. షేక్ మౌలాలి మాట్లాడుతూ, ఎమ్మెల్యే పేర్నినాని ముస్లింల అభివృద్ధిని విస్మరించారన్నారు. జనసేన నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఇలియాస్ పాషా, హసీమ్‌బేగ్, గడ్డం రాజు, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : దుర్మార్గుడి పాలనలో నియోజకవర్గ ప్రజలు భారీ మూల్యం చెల్లించుకున్నారని, కుల, మత రాజకీయాల చేసే కొడాలి నాని నేడు విగ్రహ రాజకీయాలు ప్రారంభించాడని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము విమర్శించారు. పట్టణంలోని 27వ వార్డు, కల్వపూడి అగ్రహారం గ్రామాల్లో వెనిగండ బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 27వ వార్డు రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసైనికులతో కలిసి కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జీ, యలవర్తి శ్రీనివాసరావు, పోలగాని కృష్ణయ్య, శొంఠి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రవీంద్రను గెలిపించండి : నీలిమ

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఓటర్లు వైసీపీ నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలు, కక్షసాధింపు చర్యలను దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్రను గెలిపించాలని కొల్లునీలిమ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి 18, 21, 25 డివిజన్లలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో విస్తృతంగా పర్యటించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ యథేచ్ఛగా తీరప్రాంతంలోని మట్టిని దోచుకుపోతు న్నారన్నారు. టీడీపీ నాయకులు ఉప్పాల ప్రసాద్, బచ్చుల అనిల్‌కుమార్, కొల్లు రంగనాథ్, లంకిశెట్టి నీరజ, గోకుల శివ, మాదిరెడ్డి విజయ్, దుర్గాప్రసాద్, వసంతకుమారి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పామర్రు టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. కారకంపాడు, మొవ్వపాలెం, వేములమడ తదితర గ్రామాల్లో కుమార్ రాజా పర్యటించారు. పల్లెబాట గురువారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కారకంపాడులో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నేతలు నన్నపనేని వీరేంద్ర, కోట వీరబాబు, వీరంకి తులసీదాస్, చలమలశెట్టి శ్రీనివాసరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, అనిశెట్టి రఘు, అల్లాడిశెట్టి రాఘవయ్య, దేవినేని రమేష్, మురారి నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదతుమ్మిడిలో కాగిత శిరీష ప్రచారం

బంటుమిల్లి : పెదతుమ్మిడిలో మండల పార్టీ అధ్యక్షులు కూనపరెడ్డి వీరబాబు అధ్యక్షతన బాబు ష్యూరిటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి కాగిత శిరీష ఇంటింటా తిరిగి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగిత కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. బొల్లా శ్రీనివాసరావు, మురాల నాగేశ్వరరావు, నాగేశ్వరమ్మ, రంగమణి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



బందరులో కార్మిక సంఘాల నేతల ధర్నా



పామర్రు సెంటరులో మాట్లాడుతున్న కార్మిక నేతలు



చల్లపల్లిలో అఖిలపక్ష రైతు సంఘాల నేతల ధర్నా

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

• కార్మిక సమస్యలు పరిష్కరించాలి
• ప్రజా, కార్మిక సంఘాల ధర్నా

మచిలీపట్నం టౌన్ : పంటలకు మద్దతు ధర కల్పించేందుకు సమగ్ర చట్టం చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, నూతన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలంటూ మచిలీపట్నం రేవతి సెంటర్ వద్ద గురువారం ఏఐటీయుసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయు (న్యూ) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో రైతులు జరుపుతున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు ధర్నాల మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్, లక్ష్మణరావు, ఈశ్వరరావు, ఒడుగు రత్నకుమారి, చైతన్య కుమార్, సిహెచ్ జయరావు, వెంకట్రావు, కొడాలి శర్మ, కె రాజారావు, మతీన్, యూనస్ పాల్గొన్నారు. **పామర్రు :** గిట్టుబాటు ధర కోరుతూ దేశ రాజధానికి రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సీఐటీయూ గురువారం పామర్రులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అన్నదాతలపై మోదీ ప్రభుత్వం హింసాత్మక చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. నల్ల చట్టాలను దొడ్డిదారిలో అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. సీఐటీయూ నాయకులు గంగాధర్, మూళ్లపూడి విల్సన్, రాజు, నాగభూషణం, లక్ష్మణ్, శీలం నారాయణ రావు, బసవయ్య, బీఎస్పీ నేత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా, స్థానిక రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తోట్లవల్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. వ్యవసాయ మోటార్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని, ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని, ప్రభుత్వ సంస్థల ప్రవేటీకరణను నిలిపివేయాలని నినాదాలు చేశారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి శీలం ప్రకాశరావు, జుజ్జువరపు యేసేబు, ఈడ్పుగంటి డేవిడ్‌రాజు, శ్రీమన్నారాయణ, పూర్ణయ్య పాల్గొన్నారు. **చల్లపల్లి:** రైతాంగ సమస్యలను పరిష్కరించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. అఖిలపక్ష రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. సీపీఎం నాయకులు వాకా రామచంద్రరావు, సీఐటీయూ నేత మహమ్మద్ కరీముల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్, కొండేటి బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరసామి సేవలో కాగిత

పెడన : టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ గురువారం అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గూడూరు అగస్త్యయ్య, గూడూరు శివ దత్తలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. పూటుకూరి మోహనరావు, యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం, పరసా సూర్యనారాయణ, కారువర్తి శ్రీనివాసరావు, మెట్ల సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

గుడివాడ : నెహ్రూచౌక్ సెంటర్‌లో దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారతరత్న డా.బి.ఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్యే కొడాలి నాని భూమి పూజ చేశారు. దళిత సంఘాల నాయకులు పొంగులేటి జయరాజు, కాలే జోసఫ్, మెండా కిరణ్‌కుమార్, బెజ్జం సువర్ణరాజు, కాకొల్లు రాజారెడ్డి, బొడ్డు చంటి, డోనే కోటిబాబు, రేమల్లి నీలాకాంత్, ఏలీషా పాల్గొన్నారు.

గోపాలకృష్ణకు మండలి ఘన నివాళి

మోపిదేవి : దివిసీమ ఖద్దరు గాంధీగా పేరుగాంచిన కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన కోసూరు గోపాలకృష్ణమూర్తి చిరస్మరణీయులని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గోపాలకృష్ణమూర్తి సంస్మరణ సభ గురువారం కోసూరువారిపాలెంలో జరిగింది. గోపాలకృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, కోసూరు రామాంజనేయులు, మురాల సుబ్బారావు, మత్తి శ్రీనివాసరావు, కోసూరు గోపిచంద్, కోసూరు రవి తదితరులు ఉన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

అవనిగడ్డ రూరల్ : దివిసీమ ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరిశీలించారు. రూ.18 కోట్లతో చేపట్టిన రహదారి పనులను జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పరిశీలించారు.

కార్ల మెకానిక్‌కు విద్యుదాఘాతం

పామర్రు : శైలీమ్ ఆటో గ్యారేజ్ యాజమాని, చిన్న కార్ల మెకానిక్ తలారి చంద్రమోహన్ (55) (ఎర్ర బ్బాయి) గురువారం కేబుల్ టీవీ వైర్లు సరిచేస్తున్న తరుణంలో విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రం గా గాయపడ్డాడు. దాదాపు 60శాతం శరీరం కాలిపోయినట్లుగా వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గరికపాటి సేవలు చిరస్మరణీయం

అవనిగడ్డ రూరల్ : వేకనూరులో శాంతియుత వాతావరణం నెలకొనటానికి ముఖ్య కారణం గరికిపాటి శ్రీనివాసరావు అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గరికిపాటి శ్రీనివాసరావు 15వ వర్ధంతి సందర్భంగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుమారులు కార్తీక్, సాయి, హరి, మండలి వెంకట్రామ్, యానం చిట్టిబాబు జనసేన నేత మాదివాడ వెంకట కృష్ణారావు తదితరులు గరికిపాటి విగ్రహానికి నివాళులర్పించారు.



వృద్ధాశ్రమానికి ఎస్సై చిన్నబాబు విరాళం

చల్లపల్లి : నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమం నూతన భవన నిర్మాణానికి చల్లపల్లి ఎస్సై సిహెచ్. చిన్నబాబు విరాళం అందజేశారు. భవనం శ్లాబ్ నిర్మాణానికి రూ.60 వేలను ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందించారు. జి.ప్రదీప్, తాతా సత్యమూర్తి, అడపా రవి, డేవిడ్ పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

నాగాయలంక : టి.కొత్తపాలెం నుంచి చిన ఏటిమొగ వరకు ప్రధాన రహదారికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు భూమి పూజ చేసి ప్రారంభించారు. **కోడూరు :** ఉల్లిపాలెం నుంచి వేణుగోపాలవారిపాలెం వరకు ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు.

చేయూత చెక్కుల పంపిణీ

గుడివాడ రూరల్ : వైఎస్సాఆర్ చేయూత నాల్గో విడత రూ.5.52 కోట్ల చెక్కులను మండల కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దె పుష్పరాణి పంపిణీ చేశారు. ఎంపీడీవో జ్యోతి, వైస్ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా సమైక్య అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ, మండల సమైక్య సిబ్బంది, ఏపీఎం పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ప్రచారం ప్రారంభం

అవనిగడ్డ రూరల్ : బందరు పార్లమెంట్ వైసీపీ స్థానానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న సింహాద్రి చంద్రశేఖర్ గురువారం ఎన్నికల ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దక్షిణ చిరువోలులంకలో ఇంటింటికీ తిరిగి విజయం చేకూర్చాలని కోరారు. సింహాద్రి రామ్ చరణ్, సింహాద్రి వెంకటేశ్వరరావు, కమ్మిలి రాజా, మాధవ, వైసీపీ నేతలు పాల్గొన్నారు.



విపత్తు ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి : ప్రకాశం

అవనిగడ్డ : విపత్తు ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశం కోరారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ స్వగృహాన్ని ప్రకాశం దంపతులు గురువారం సందర్శించగా, ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ రవితేజ, మాజీ జడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథప్రసాద్, బండే రాఘవ, విశ్వనాధుని మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం

పెడన రూరల్ : విద్యార్థి దశ నుండే సేవా భావం కలిగి ఉండాలని పెనుమల్లి సర్పంచి గరికపాటి రామానాయుడు అన్నారు. పెడన విజయానంద డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పెనుమల్లి, నందిగామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ ఇచార్జి కెవి రమణరావు విద్యార్థులు చేపట్టే సేవా కార్యక్రమాలను వివరించారు. నందిగం, పెనుమల్లి పాఠశాలల ఆవరణలను విద్యార్థులు శుభ్రం చేశారు. అబ్దుల్ బషీర్, సుభాషిణి, చంద్రశేఖర్, విజయకుమారి పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెడన రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని సర్పంచ్ చీర్ల అనూష అన్నారు. కాకర్లమూడి, కోట పాలెం, పెద నందమూరు, గౌడపాలెం, బల్లిపర్రు, మడక, నడుపూరు, అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. తల్లులకు, గర్భిణులకు చిన్నారులకు, కిశోర బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ శ్రావణకుమారి, ఆరోగ్య సిబ్బంది అరుణ, సత్యవతి, షుసా, లక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మి, విశలేశ్వరి, నాగమణి, నాగమ్మ, సుజాత పాల్గొన్నారు.

బాధితులకు అధికారుల పరామర్శ

గుడ్లవల్లేరు : చిన్నారిపై వరాహం దాడి శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి గ్రామ పంచాయితీ అధికారులు స్పందించారు. చిన్నారి హర్షిణి, అమ్మమ్మ ఉదయశ్రీలను పిచాయితీ కార్యదర్శి నరసింహారావు, శానటరీ ఇన్స్‌పెక్టర్ లు పరామర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం కూడా అందించారు.